# జి-20 సమావేశం 'యుద్ధ ముగింపు' గురించి

**2022** నవంబర్ 15న ఇండోనేషియాలోని బాలిలో జి-20 దేశాల సదస్సు జరిగింది. జి-20 దేశాల నాయకులు ఈ సదస్సులో కలుసుకొని, ఉక్రెయిన్‌లో యుద్ధం శాంతియుత పద్ధతుల్లో ఆపివేసితీరాలని అభిప్రాయపడ్డారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ సమావేశాలకు హాజరుకాలేదు.

వీడియో లింక్ ద్వారా జి-20 సదస్సు నుద్దేశించి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రసంగించాడు. 'న్యాయబద్ధంగా మరియు ఐక్యరాజ్యసమితి సూత్రాలు, అంతర్జాతీయ న్యాయాల ప్రాతిపదికపై ఆధారపడి' యుద్ధాన్ని ముగించితీరాలి. 'రష్యా సాగిస్తున్న విధ్వంసక యుద్ధం తప్పనిసరిగా ఆపగలిగే సమయమిది. ఒక్కోరోజు ఆలస్యం, ఉక్రెయిన్ మరణాల్ని పెంచుతోంది; ప్రపంచం ముందు నూతన సవాళ్ళను వుంచుతోంది. రష్యా దురాక్రమణ యుద్ధం కొనసాగినందు వలన, నష్టాలలో - ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ - భారీ పెరుగుదల నమోదవుతుంది' అని జెలెన్‌స్కీ పేర్కొన్నాడు.

"రష్యాతో చర్చలు జరిపేందుకు ఉక్రెయిన్ నిరాకరి స్తోందని, అంతేగాక శాంతి కోసం అవాస్తవికమైన షరతులను ముందు పెడుతోందని" రష్యా విదేశాంగశాఖామంత్రి పేర్కొన్నాడు.

జి-20 సదస్సును ప్రారంభిస్తూ ఇండోనేషియా అధ్యక్షుడు విడోడో ఐక్యత కోసం విజ్ఞప్తి చేశాడు. "మనకు మరో ప్రత్యామ్నాయం లేదు; ప్రపంచాన్ని కాపాడుకోవాలంటే కలసికట్టుగా వుండటం అవసరమన"ని ఆయన పేర్కొన్నాడు.

"ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న అనాగరిక యుద్ధం మరియు అణుబాంబుల గురించి రష్యా చేసిన బాధ్యతారహితమైన హెచ్చరిక"లను అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఈ సదస్సులో లేవనెత్తటంతోపాటుగా, "చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పేర్కొన్న 'అణ్వాయుధాలతో తలపడి ఎవరూ విజయం సాధించలేర'నే తమ ఒప్పందాన్ని పునరుద్ఘాటించటంతోపాటు అణ్వాయుధాలు వుపయోగించటం పట్ల తమ వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ ఉక్రెయిన్‌లో అణ్వాయుధాలను ఉపయోగించటాన్ని తక్కువగా అంచనా వేయవద్దని" బైడెన్ పేర్కొన్నాడు.

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ జి-20 సదస్సు నుద్దేశించి చేసిన ప్రసంగంలో ఉక్రెయిన్ యుద్ధాన్ని గురించి సూటిగా పేర్కొనకుండా ప్రపంచ "సంఘీభావం" పెరుగుదలకు ఆయన పిలుపునిచ్చాడు. 'మానవజాతి భవితవ్యపు భాగస్వామ్య భావన, శాంతి బోధన, అభివృద్ధి, పరస్పర సహకారంతో అన్ని దేశాలు సామూహిక దృక్పథాన్ని ఏర్పరచుకోవటం అనివార్యమ'ని ఆయన పేర్కొన్నాడు. విభేదాలు, సంఘర్షణలు ఏ ఒక్కరి ప్రయోజనాన్నీ కాపాడలేవన్నారు. కేవలం ఉమ్మడి అభివృద్ధి, సంఘీభావాలే సరైన ప్రత్యామ్నాయాలుగా చేసుకోవాలని ఆయన కోరారు.

యుద్ధానికి ముగింపు పలకటానికి దౌత్య సంభాషణలను తిరిగి ప్రారంభించాలని జి-20 నాయకులకు భారత ప్రధాని మోడీ విజ్ఞప్తి చేశాడు. "ఉక్రెయిన్‌లో కాల్పుల విరమణ, దౌత్య సంభాషణల విధానానికి తిరిగి వెళ్ళే మార్గాన్ని మనం కనుగొనాలి" అని జి-20 సదస్సు ప్రారంభ వాక్యాలలో మోడీ పేర్కొన్నాడు. 'ప్రపంచంలో శాంతి, కలసిమెలసి జీవించటం, భద్రతలకు హామీ కల్పించేవిధంగా నిర్దిష్టమైన, సామూహిక పరిష్కారాన్ని చూపడమే నేటి తక్షణ కర్తవ్యమ'ని మోడీ ఉద్బోధించాడు.

ఒకవైపున సదస్సు జరుగుతూండగానే, పోలెండ్ సరిహద్దుల వద్ద రష్యా 75 క్షిపణులను మోహరించిందని, ఈ క్రమంలో క్షిపణి దాడిలో ఇద్దరు పోలెండ్ పౌరులు మరణించారనే ఆరోపణలు ముందుకొచ్చాయి. నాటో మరియు జి-7 నాయకులతో బాలిలోనే బైడెన్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించి, రష్యా చర్యలను ఖండించాడు. "నాటో కూటమికి చెందిన పోలెండ్ నుండి రష్యా ప్రయోగించిన ఒక క్షిపణి కారణంగా ఇద్దరు మరణించారనటం 'ప్రతికూలమైనది'గా బైడెన్ పేర్కొన్నాడు. తర్వాత, ఉక్రెయిన్ నుండే క్షిపణి ప్రయోగం జరిగిందని, ఆ క్షిపణి ఆ దేశానికి చెందినదేనని పోలెండ్ అధికార వర్గాలు ధృవీకరించాయి. అయితే పోలండ్ చేసిన ప్రకటనను ఉక్రెయిన్ ప్రభుత్వం తిరస్కరించింది.

2022 జూన్‌లో జరిగిన జి-7 దేశాల సదస్సులో ఆయా దేశాల నాయకులు ఒక సంయుక్త ప్రకటన చేస్తూ "తాము ఉక్రెయిన్‌కు ఆర్థికపరమైన, మానవతాపరమైన, దౌత్యపరమైన సహాయ సహకారాలను సమకూర్చటాన్ని కొనసాగిస్తామని" ప్రకటించారు. జి-7 సదస్సు అలాగే జి-20 సదస్సుల నుండి మనకు అర్థమయ్యేదేమంటే ఐక్యరాజ్యసమితి జోక్యంతో యుద్ధాన్ని నిలువరించే మార్గాన్ని కనుగొనేందుకు జి-7, నాటో దేశాలు సిద్ధంగా లేవని తెలుస్తోంది.

2022 ప్రారంభంలో జరిగిన 'బ్రిక్స్' సదస్సులో 'బ్రిక్స్' దేశాలు ఉక్రెయిన్ యుద్ధంపై బీజింగ్ ప్రకటనకు ఆమోదం తెలిపాయి. ఆ ప్రకటన ప్రకారం, ఐక్యరాజ్యసమితి ప్రయత్నాలు చేసి ఉక్రెయిన్, రష్యాల నడుమ చర్చల్ని పునరుద్ధ రించటానికి మద్దతుగా నిలవాలి. అలాగే ఉక్రెయిన్‌లోను, ఆ పరిసరాల్లోనూ మానవ హననానికి సంబంధించిన పరిస్థితిపట్ల వారంతా బాధ్యతతో స్పందించారు. రెండు దేశాల నడుమ ఎట్టి పరిస్థితుల్లోనూ శాంతియుత ఒప్పందంతో యుద్ధం ముగియాలని, రష్యాపై ఆంక్షలు యుద్ధ సమస్యకు పరిష్కారంకాదని, దాని దుష్ఫలితాలతో ప్రపంచవ్యాపితంగా ఇంధనం, ఎరువుల కొరత

ఏర్పడుతుందని జి-20 సదస్సులోని 'బ్రిక్స్' దేశాలు తమ అభిప్రాయాల్ని వ్యక్తం చేశాయి. ఇంధనం, ఎరువుల తయారీ, ఎగుమతిదారులతో రష్యా ప్రపంచంలో అగ్రభాగాన వుంది. అలాగే ఉక్రెయిన్, ప్రపంచంలోని ఉన్నతస్థాయి ఆహార ఉత్పత్తిదారులలో ఒకటిగా వుంది.

ఉక్రెయిన్ యుద్ధంపై జి-7, నాటో, బ్రిక్స్ దేశాల ఈ ప్రకటనల ద్వారా యుద్ధాన్ని ఆపటానికి ప్రయత్నించే బదులుగా తమ దుష్ట కోర్కెలను నెరవేర్చుకునేందుకు ఉక్రెయిన్‌ను జి-7 మరియు నాటో దేశాలు మరింతగా రెచ్చగొడుతున్నాయని అర్థమౌతోంది. 'బ్రిక్స్' దేశాలు శాంతిని ప్రబోధిస్తూనే, ఏ పక్షంవైపు మొగ్గకుండా రెండువైపులా తమ అవసరాల్ని నెరవేర్చుకునేందుకు చూస్తున్నాయి. ఈ యుద్ధం కారణంగా అంతిమంగా ప్రజలే తీవ్ర బాధితులని స్పష్టమౌతోంది.

రానున్న 18వ జి-20 సదస్సుకు భారతదేశం ఆతిథ్యమివ్వనుంది. ఇండియా యొక్క అధ్యక్ష పదవి 2022 డిసెంబర్ 1 నుండి ప్రారంభమై 2023 చివరి త్రైమాసికంలో జరిగే సదస్సు వరకు కొనసాగుతుంది.

*****